నా వెన్నులోంచి చలిపుట్టుకొచ్చింది. ఇక ఆలస్యం అయితే నా శాన్యోరా—దక్కదు.

వణుకుతున్న చేతుల్తో, శాన్యోరాను పసిపాపలా రెండు చేతుల్లోకి ఎత్తుకొని పిచ్చివాడిలా పరిగెత్తసాగాను కారవాన్ వేపు. సగం దారిలో నాకోసం వెతుకుతున్న పాల్‌మాన్, బార్బరా సుసాన్ మొదలైన వాళ్ళు కనబడ్డారు.

“భయంకర్! శాన్యోరా కేమయింది” అన్నాడు పాల్‌మాన్ గాభరాగా చూస్తూ.

“ప్లీజ్! ముందు కాంపైన్ దగ్గరికి పదండి!” అన్నాను పరిగెత్తుతూనే.

నా వెనుకే వాళ్ళంతా పరుగెత్తసాగారు.

ఓ జీపు సీటులో అడ్డంగా పడుకోబెట్టాను శాన్యోరాని! “మిస్టర్ పాల్‌మాన్! వేరీజ్ ది డాక్టర్? వెంటనే ‘క్లోరమీన్’ లోడ్ చేసి ఇంజెక్షన్ పట్రమ్మని చెప్పండి. ఐ వాంట్ క్విక్ యాక్షన్ ప్లీజ్!”

అరిచాను ఆయాసంగా.

“వచ్చేస్తున్నాడు భయంకర్! లోడ్ చెయ్యడం పూర్తి..” అన్నాడు పరిగెట్టుకుంటూవచ్చి పాల్‌మాన్.

అతని మాటలు పూర్తవకుండానే డాక్టర్ వచ్చాడు చేతిలోని లావుపాటి హైపోడెర్మిక్ సిరెంజితో.

“డాక్టర్ క్విక్!” అన్నాను. శాన్యోరా గౌనుపైకి తొలగించి కుడితొడవేపు చూపిస్తూ.

డాక్టర్ వెనువెంటనే పొడవాటి సూది ఆమెతొడలో గుచ్చాడు.

మెల్లిగా సిరెంజి నొక్కాడు డాక్టర్. మందు ఖాళీ అయింది. సిరెంజి సూది నెమ్మదిగా బయటికి వచ్చింది.

